క్లుప్తంగా

ప్రారంభమైన మొహర్రం వేడుకలు



నకరికల్లు: పవిత్ర ధర్మయుద్ధంలో అమరులైన వారి త్యాగానికి ప్రతీకగా మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొహర్రం మాసంలోని మొదటి పదిరోజుల పాటు మొహర్రం వేడుకలు చేస్తారు. బుధవారం నుంచి ప్రారంభమైన మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని చల్లగుండ్ల, గుండ్లపల్లి, చాగల్లు గ్రామాలతో పాటు పలుగ్రామాల్లో పీర్ల పండుగగా పిలువబడే మొహర్రం కోసం చావిడీలు ముస్తాబు చేశారు. నెలపాడుపు మొదటిరోజు కావడంతో అమరులకు గుర్తుగా పీర్లను అలంకరిస్తారు. తొలిరోజే ఆయా గ్రామాల్లోని చావిడిల్లో పీర్లను ముస్తాబు చేశారు. మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో ధర్మయుద్ధంలో అమరులైన వారి త్యాగాన్ని స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్లాం మతపెద్దలు మాట్లాడుతూ ధర్మయుద్ధంలో అమరులైన వారి కోసం పదిరోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, అగ్నిగుండ ప్రవేశం, గ్రామోత్సవం, ఉపవాస దీక్షలు జరుపుకొంటామని తెలిపారు.

112 మందికి వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ బుధవారం వైద్య సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వెంకటకృష్ణ కుమార్ 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 49 మందికి బీపీ, 35 మందికి షుగర్, 43 మందికి బీపీ, షుగర్ రెండింటికి మందులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలకు పరీక్షలు చేసి బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ కార్యకర్తకు, తల్లిదండ్రులకు సూచించారు. నలుగురు బాలింతలకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. హెల్త్ విజిటర్ ఉషారాణి, ఏఎన్‌ఎం విమల, హెల్త్ అసిస్టెంట్ హుస్సేన్, మహిళా పోలీసు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు దీవెన, కరుణమ్మ పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి



బొల్లాపల్లి: నర్సరీ యజమానులు నర్సరీ చట్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ అన్నారు. మండలంలోని మేళ్లవాగు, రెడ్డిపాలెం పరిధిలో ఉన్న షేడ్‌నెట్ నర్సరీలను ఆయన క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నబీరసూల్ మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ 9 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్‌తో రక్షణ కల్పించాలని, షేడ్ నెట్ హౌస్‌లో డబుల్ డోర్ సిస్టం కలిగి ఉండాలని, నెట్‌కు గాని, ఇన్సెక్ట్ నెట్‌కు గాని కీటకాలు లోపల ప్రవేశించకుండా ఉండేందుకు నెట్‌కు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు. మిరప విత్తనాలను పోట్రేలలో నాటి వాటిని ఎత్తయిన మడులపై అమర్చాలన్నారు. పోట్రేలలో శుద్ధి చేసిన కోకో పీట్ మాత్రమే వాడాలన్నారు. కోకో పీట్‌ను శుద్ధి చేయుటకు ఒక కేజీ ట్రైకోడెర్మా విరిడి, ఒక కేజీ సూడోమోనాస్ కలపాలన్నారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీలు ఉన్నట్లయితే యజమానులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాణ్యమైన నారును రైతులకు అందించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రవీంద్ర, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- మాదిపాడులో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

అచ్చంపేట: తమది మాటలు ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని మాదిపాడులో బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలో ఒక్కొక్కటి రూ.5.50లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో పునర్నిర్మించిన పీర్లచావడిని ప్రారంభించారు. అనంతరం పీర్ల చావిడిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చడమే కాకుండా, హామీ ఇవ్వని అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను సైతం చేపట్టామన్నారు. వాస్తవానికి మాదిపాడుపై బ్రిడ్జి నిర్మాణం తమ ఎన్నికల ప్రణాళికలో లేదని అయినా పల్నాడు, ఎన్టీఆర్ జిల్లా ప్రజల సౌలభ్యంకోసం రూ.62కోట్లతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. రెండు జిల్లాల కలయికతో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయన్నారు. రవాణా సౌకర్యాలు, వ్యాపార లావాదేవీలు, రాకపోలకు సులభతరమవుతాయని చెప్పారు. ఈ ప్రాంతంలో లభ్యమయ్యే సహజవనరులను ఉపయోగించుకుని వేలమంది యువకులకు ఉపాధి కల్పించేందుకు భవిష్యత్‌లో ఒక పరిశ్రమను తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నామని, ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి..

మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో అడవిలో స్వయంభుగా వెలసి భక్తులచే నిత్యం పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లి ఆలయ పరిసరాలు, మెయిన్ రోడ్డు నుంచి ఆలయానికి వెళ్లేరోడ్డుకు ఇరువైపులా పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి కె.రామచంద్రయ్యతో కలసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఫారెస్ట్ అధికారి కె.రామచంద్రయ్య మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యులు మొక్కల సంరక్షణ చేపట్టాలని చెప్పారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం ఒక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోబోతుందన్నారు. ఎకో పార్కు నిర్మాణంలో ఉందని, గెస్ట్ హౌస్, భక్తుల విశ్రాంతి గదులు, ఆలయం వరకు పక్కా నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మాదిపాడు సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ వెంకట్రామయ్య, ఎంపీటీసీ భుక్యా స్వర్ణమ్మ రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ గుడారి గోపి, ముస్లిం నాయకులు షేక్ కరిముల్లా, లాలు తదితరులు పాల్గొన్నారు.



పీర్లచావిడి ప్రారంభించి ముస్లింలతో కలసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి-బెల్లంకొండ రోడ్డు పనుల పరిశీలన...

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అమరావతి-బెల్లంకొండ డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మండల పరిధిలోని ఘునగోడు గ్రామం వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే అవసరమున్న చోట రోడ్డు వెడల్పు చేయాలన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తమ్మవరంలో అభివృద్ధి పనులు ప్రారంభం..

పెదకూరపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామాలకు వాటి ఫలాలు అందుతున్నాయని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని తమ్మవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్‌లను బుధవారం ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం పూర్తయిన గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున అందజేసిందన్నారు. వాటితో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి కంకణాల శివాజీ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చామర్తి మస్తాన్, అప్పారావు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు పట్టాల పంపిణీ...

బెల్లంకొండ: ఎన్నో ఏళ్లుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలను అందించి భరోసా కల్పిస్తూ, వారిని అభివృద్ధి దిశగా ముందుకు నడిపించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. బుధవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన 23 మంది గిరిజన రైతులకు చెందిన సుమారుగా 46ఎకరాల అటవీ భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి గిరిజన, పేద రైతులు కోసం 2005 అటవీ హక్కుల చట్టాన్ని ప్రవేశ పెట్టి, దాని ద్వారా వారి భూములకు పట్టాలను ఇచ్చేందుకు అవకాశం కల్పించారన్నారు. మహానేత హయాంలో రాష్ట్రంలో సొంత భూములు లేని ఎంతో మంది పేద గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అదే బాటలో ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ గిరిజనుల అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో గిరిజనులు అధికంగా ఉన్న అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలలో అనేక మందికి ఇప్పటికే పట్టాలు పంపిణీ చేశామన్నారు. అర్హత కలిగిన ప్రతి గిరిజన రైతుకు పట్టాను అందించే విధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ దేసు మల్లేశ్వరి, బ్రహ్మం, ఎస్టీ నాయకుడు భుక్యా రామకోటీనాయక్, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజన రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సమస్యలు పరిష్కరించాలని వినతి



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఎన్ఎస్పీ కెనాల్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడబ్ల్యూడీ వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని డివిజన్ కార్యాలయంలో డీఈ మురళీధర్‌కు బుధవారం యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్క్ చార్జ్డ్ మెయింటెనెన్స్ సిబ్బంది, నెలవారి జీతంతో కూడిన అన్ని రకాల బిల్లులను చెల్లింపు విషయం, సాగర్ కుడి కాలువ పరిధిలో ఉన్న ఖాళీల భర్తీ చేయడం, దీర్ఘకాలిక సమస్యలపై వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు కట్టాశంకర్రావు, ఉపాధ్యక్షులు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

నాదెండ్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యం నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో శోభారాణి చెప్పారు. నాదెండ్ల రెండో హెల్త్ సబ్‌సెంటర్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి కుటుంబానికి మెరుగైన ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 24 గంటల వైద్యం ద్వారా సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పీహెచ్‌సీలో పని చేసే వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో వైద్యశాఖకు గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రియాంక, హెచ్‌వీ సీతామహాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌వీ అశోక్, ఏఎన్‌ఎం కల్పన, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం తూబాడు సబ్‌సెంటర్‌ను పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రాబోయే తరాలకు మంచి ఆరోగ్యం, భవిష్యత్తు మరియు అన్నింటికంటే విలువైన మంచి భూమిన అందించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో పీఎండీఎస్(ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్) నవధాన్యాలు వేసిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ పీఎండీఎస్ పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, తర్వాత పండించుకునే పంటలు మంచి ఆరోగ్యంగా ఉంటాయని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతుకి ఖర్చు తగ్గి తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం మిరప పంట వేసే రైతులు పీఎండీఎస్ వేసుకోవడానికి ఇదే మంచి అదును అవుతుందన్నారు. మిరప పంట వేసే రైతులు ఈ సాగు ద్వారా భూమిలో సూక్ష్మ జీవుల అభివృద్ధి చెంది ప్రధాన పంటకి అవసరమైన పోషకాలు అందిస్తాయన్నారు. మొత్తం 30 రకాల విత్తనాలు కలిపి ఒక కిట్టుగా అందిస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రంలో లేదా ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కలవాలని చెప్పారు. ప్రధాన పంట వేయడానికి ముందు చల్లుకోవాలని, 45రోజులకు భూమిలో కలియదున్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్.ఎఫ్.ఏ నందకుమార్, ఉమ, పూజ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

అర్హులందరికీ ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



సత్తెనపల్లి 10వ సచివాలయం వద్ద ధ్రువపత్రాలు అందిస్తున్న చల్లంచర్ల, కౌన్సిలర్లు

వాడవాడలా జగనన్న సురక్ష క్యాంపులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పేదరికమే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రామాణికమని, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం అందజేస్తుందని చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని నాగన్నకుంట మసీదు వద్ద బుధవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. క్యాంపులో పాల్గొన్న చల్లంచర్ల మాట్లాడుతూ సాంకేతిక సమస్యల మూలంగా సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలను వారి ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 1403 గృహాలకుగాను 1141గృహాలు సర్వే చేసి 493 టోకెన్‌లు అందించారు. 411 సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందించారు. మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, కౌన్సిలర్లు కాకుమాను రవి, శెట్టి ఆనంద్, ఆకుల రమేష్, నాయకులు ఆకుల హనుమంతరావు, శిరిగిరి వెంకట్రావు, పెద్దింటి చిట్టి, సెగ్గం వెంకటేశ్వరరావు, బండి మల్లిఖార్జునరెడ్డి, పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి: మండల కేంద్రమైన అమరావతి-2 సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం గ్రామసభలో ఎంపీపీ మేకల హనుమంతరావు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. మొత్తం 276 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మండలస్థాయి అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమరావతి-2 సచివాయలంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల హనుమంతరావు



ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న భవనం రాఘవ రెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి

నర్సింగపాడులో...

నకరికల్లు: అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి ప్రభుత్వ పథకాల లబ్ధిచేకూర్చేందుకు జగనన్న సురక్ష దోహదపడతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందని అన్నారు. వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, సర్పంచ్ సంగు రామకోటమ్మ, ఉప సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు పరిశీలన

శావల్యాపురం: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మంచినీటి చెరువును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్, సచివాలయ ఇంజినీరు లక్ష్మణ్‌లు సందర్శించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మంచినీటి చెరువులోని తాగునీరు నెల వరకు గ్రామంలోకి విడుదల చేయడానికి అవకాశం ఉందని, త్వరలో సాగర్ జలాలు విడుదల చేయగానే చెరువులోని నీటిని పూర్తిస్థాయిలో బయటకు పంపిన తదుపరి చెరువును నాలుగు రోజుల పాటు ఎండ బెట్టి, బావిలో కూడా పూడికతీత పనులు బావి దగ్గర ఏర్పాటు చేసిన పైపులైను మరమ్మతులు చేస్తామన్నారు. అనంతరం నూతనంగా రూ, లక్ష రూపాయల వ్యయంతో రెండు విద్యుత్ మోటార్లు అమర్చుతామన్నారు.

లైసెన్స్ లేని నర్సరీలపై చర్యలు

రాజుపాలెం: షేడ్ నెట్ నర్సరీ యజమానులు ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, లైసెన్సులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఉద్యానశాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్‌తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెం, రాజుపాలెం గ్రామాలలో మిరప నారు పెంచుతున్న నర్సరీలను ఉద్యానశాఖాధికారి బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నర్సరీలలో రికార్డులలో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. విత్తనాలు ఇచ్చిన రైతులకు రసీదులు ఇచ్చి, నాణ్యమైన నారు అందించాలని తెలిపారు. రైతులు నారు తీసుకునే సమయంలో రసీదు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

నేడు బొల్లవరంలో 'జగనన్న సురక్ష'

ముప్పాళ్ళ: మండలంలోని బొల్లవరం గ్రామంలో ఈ నెల20వ తేదీన జగనన్న సురక్ష క్యాంపు జరుగుతుందని గ్రామ సర్పంచ్ బద్దిగం పూజితారెడ్డి బుధవారం తెలిపారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరై ప్రభుత్వ పథకాలు పొందేందుకుగాను అర్హులకు అవసరమైన ధ్రువీకరణపత్రాలు అందిస్తారన్నారు.

నేడు సీఆర్ మోహన్ సంస్మరణ సభ

చిలకలూరిపేట: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, ప్రజానాట్యమండలి కళాకారుడు, కార్మిక ఉద్యమాల పోరాటయోధుడు సీఆర్ మోహన్ సంస్మరణ సభ గురువారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ మారుతీవరప్రసాద్, ప్రజా నాట్యమండలి కళాకారులు, సీఆర్ కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

బీఎల్‌ఓలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

వినుకొండ (నూజెండ్ల): ఓట్ల మార్పులు, చేర్పులలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బీఎల్‌వోలకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, పులిచింతల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు సూచించారు. పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి బీఎల్‌వోలతో ఐదు మండలాల అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌లు, తహసీల్దార్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌వో శ్రీరాములు మాట్లాడుతూ నూతన ఓట్ల జాబితాను బీఎల్‌వోలు జాగ్రత్తగా వెరిఫికేషన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో పూర్తి విచారణ జరిపి అక్కడ ఉండనటువంటి వారి ఓట్లను రద్దు చేయాలని, అదే మాదిరగా కొత్త ఓట్ల చేర్పులను కసరత్తు చేయాలని సూచనలు చేశారు. ఓట్ల మార్పులు, చేర్పులలో నిష్పష్టంగా ఉండాలన్నారు.

నేడు బూత్‌లెవల్ ఏజెంట్లతో సమావేశం

క్రోసూరు: వైఎస్సార్ సీపీ క్రోసూరు కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరుశంకరరావు ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మూడు మండలాల బూత్‌లెవల్ ఏజెంట్లతో సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం జరుగుతుందని, పార్టీ బూత్‌లెవల్ ఏజెంట్లు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

నేడు అంబడిపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెం సచివాలయ పరిధిలోని అంబడిపూడి గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొంటారని తెలిపారు.

సరస్వతి శిశుమందిర్‌కు బోధన సామగ్రి వితరణ

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు పర్చూరుకు చెందిన ఎస్ఆర్ఐ డాక్టర్ గోరంట్ల వాసుబాబు రూ.30వేలు విలువ చేసే బోధన సామగ్రిని, ప్రయోగశాల పరికరాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన వైద్యుడు గజ్జల నాగభూషణరెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను విద్యాబోధన ద్వారా సరస్వతీ శిశుమందిర్ అందిస్తుందన్నారు. డాక్టర్ వాసుబాబు స్ఫూర్తితో తమ వైద్యశాల నుంచి కూడా పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ మాట్లాడుతూ పట్టణంలోని అనేక మంది దాతల చేయూతతో పాఠశాల నిర్వహణ జరుగుతోందని, ప్రవాస భారతీయుడు వాసుబాబు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రతాపసింహశాస్త్రి మాట్లాడుతూ వైద్యుడు వాసుబాబు సుమారు 250 పాఠశాలలకు రూ.కోటి విలువైన పరికరాలను అందించారన్నారు. కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి చలువాది చినసత్యనారాయణ అధ్యక్షత వహించారు. పూజల వెంకటకోటయ్య, న్యాయవాది ఎం.వి.సుబ్బారెడ్డి, సరస్వతీ విద్యాపీఠం జిల్లా కార్యదర్శి కట్టా శంకరరావు, గుంటూరు విభాగ్ కార్యదర్శి అబ్బూరి సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, బదరీనారాయణ, హెచ్‌ఎం మన్నవ ధనలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గజ్జల నాగభూషణ రెడ్డి